ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 14-11-2026 సమయం: రాత్రి 8గం.30ని.లు

ముఖ్యాంశాలు

- సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ న్యాయ సేవల్ని మరింత సమర్థవంతంగా ప్రజలకు అందించాలని మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ యువ న్యాయవాదులకు పిలుపునిచ్చారు.

- యుద్ధ ప్రభావిత దేశాల్లోని నకిలీ ఉద్యోగ అవకాశాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని ఏలూరు జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి సూచించారు.

- తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టిక్కెట్లకు సంబంధించిన కోటాను ఈ నెల 18న ఆన్ లైన్ లో విడుదల చేయనున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) తెలిపింది.

- బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం రేపు వాయుగుండంగాను, సోమవారం నాటికి తుపానుగా బలపడే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ వెల్లడించారు.

==========

యువ న్యాయవాదులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ న్యాయ సేవల్ని మరింత సమర్థవంతంగా ప్రజలకు అందించాలని మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ సూచించారు. విశాఖపట్నంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం కన్వెన్షన్ సెంటర్ లో ఈరోజు డాక్టర్ బీఆర్. అంబేద్కర్ లా కళాశాల ఆధ్వర్యంలో కేంద్ర న్యాయశాఖ సహకారంతో నిర్వహించిన డాక్టర్ జస్టిస్ కె. రామస్వామి స్మారక ఉపన్యాస కార్యక్రమంలో రామ్ నాథ్ కోవింద్ ప్రసంగించారు. డిజిటల్ యుగంలో న్యాయవృత్తికి అనేక కొత్త అవకాశాలు ఏర్పడుతున్నాయని, అదే సమయంలో పలు సవాళ్లు కూడా ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. పేదలు, నిస్సహాయులకు ఉచిత న్యాయ సహాయం అందించడంలో యువ న్యాయ విద్యార్థులు చురుకైన పాత్ర పోషించాలని రామ్ నాథ్ కోవింద్ పిలుపునిస్తూ...

(వాయిస్...32 సెకన్లు)

==========

పంచాయతీ ఎన్నికలకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామని రాష్ట్ర ఎన్నికల అధికారి అనిల్ చంద్ర పునేఠా తెలిపారు. తిరుపతి కలెక్టరేట్ లో పంచాయతీ ఎన్నికల నిర్వహణపై 12 జిల్లాల పోలీసు ఉన్నతాధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. పోలింగ్ రోజు శాంతి భద్రతలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. సమస్యాత్మక 12 జిల్లాల ఎస్పీలతో ప్రత్యేకంగా చర్చించామన్నారు. నామినేషన్ల సమర్పణకు ఎవరైనా ప్రత్యేక ఎస్కార్ట్ కావాలంటే కల్పిస్తామని, దాడి ముప్పు ఉందని ఎస్పీకి తెలియపరిస్తే.. అభ్యర్థులకు ప్రత్యేక భద్రత కల్పిస్తారని పేర్కొన్నారు.

==========

రీ-సర్వే, మ్యుటేషన్లు, భూముల వర్గీకరణ, భూ రికార్డుల సవరణ తదితర అంశాల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా చర్యలు చేపట్టాలని ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.జయలక్ష్మి విజయనగరం జిల్లా అధికారులను ఆదేశించారు. గ్రామాల వారీగా పెండింగ్ సమస్యలను గుర్తించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. విజయనగరం కలెక్టరేట్ లో రెవెన్యూ, సర్వే శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లాలో రీ-సర్వే పురోగతి, ల్యాండ్ క్లాసిఫికేషన్, పీపీబి, పి.జి.ఆర్.ఎస్ తదితర అంశాలను సమీక్షించారు. రీ-సర్వే ప్రక్రియలో రైతుల భాగస్వామ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, భూ సరిహద్దులు, హక్కులు, రికార్డులకు సంబంధించి రైతులకు ఉన్న సందేహాలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించాలని ఆమె స్పష్టం చేశారు.

==========

కేంద్ర అంతర్ మంత్రిత్వ శాఖల బృందం తూర్పుగోదావరి జిల్లాలోని కొవ్వూరు, నిడదవోలు ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి మురసు తుపాను ప్రభావంతో జరిగిన పంట నష్టాన్ని అంచనా వేసింది. చాగల్లు మండలంలోని పలు గ్రామాల్లో వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి, దెబ్బతిన్న పంటలను, రైతులకు జరిగిన నష్టాన్ని పరిశీలించింది. భవిష్యత్తులో ఇటువంటి ప్రకృతి విపత్తుల సమయంలో పంట నష్టాన్ని తగ్గించేందుకు ప్రత్యామ్నాయ పంట రకాలు, వంగడాలు, పంటల వైవిధ్యీకరణ, శాస్త్రీయ పంట యాజమాన్య పద్ధతులపై వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలను అనుసరించాలని బృందం సూచించింది.

==========

యుద్ధ ప్రభావిత దేశాల్లోని నకిలీ ఉద్యోగ అవకాశాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని ఏలూరు జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి సూచించారు. వాటి ప్రామాణికతను నియామక ఏజెంట్లు క్షుణ్ణంగా తనిఖీ చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆమె ఆదేశించారు. సామాజిక మాధ్యమం, స్థానిక ఏజెంట్ల ద్వారా రష్యాలో తోటపని, శుభ్రత, మెకానికల్ వంటి సాధారణ ఉద్యోగాల పేరుతో యువతను ఆకర్షిస్తున్నారని కలెక్టర్ తెలిపారు. అక్కడికి వెళ్లాక వారిని బలవంతంగా రష్యన్ సైన్యంలో చేర్చి, యుద్ధ క్షేత్రాలకు పంపుతున్నట్లు ఏపీ.ఎన్.ఆర్.టి (APNRT) సొసైటీ హెచ్చరించిందని పేర్కొన్నారు.

==========

తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టిక్కెట్లకు సంబంధించిన కోటాను ఈ నెల 18వ తేదీన ఉదయం 10 గంటలకు ఆన్ లైన్ లో విడుదల చేయనున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడీ) ఈరోజు ఒక ప్రకటనలో తెలిపింది. 21న ఉదయం 10గంటలకు కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవ టోకెన్ల కోటాను విడుదల చేయనున్నారు. ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను 24న ఉదయం 10 గంటలకు తిరుమల, తిరుపతిలలో గదుల కోటాను 24న మధ్యాహ్నం 3 గంటలకు విడుదల చేస్తామని.. భక్తులు ఆన్ లైన్ ద్వారా టిక్కెట్లను బుక్ చేసుకోవాలని టిటిడి ఆ ప్రకటనలో తెలిపింది.

==========

విరామం

==========

అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలం పెనుగొల్లు వద్ద వరాహనదిలో స్నానానికి దిగి ముగ్గురు యువకులు గల్లంతయ్యారు. ఆరుగురు నదిలో కొట్టుకుపోతుండగా స్థానికులు ముగ్గురిని కాపాడగా, మరో ముగ్గురు గల్లంతయ్యారు. వెంటనే స్థానికులు నదిలోకి దిగి గాలింపు చేపట్టినా వారి ఆచూకీ లభించలేదు. సమాచారం అందుకున్న పోలీసులు.. గజ ఈతగాళ్ల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై హోంమంత్రి వంగలపూడి అనిత స్పందించారు. నదిలో గల్లంతైన యువకుల ఆచూకీ కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేయాలని అధికారులను ఆదేశించారు.

==========

రైతులు ఎరువుల కోసం దుకాణాల వద్ద గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉండే ఇబ్బందులకు త్వరలో తెరపడనుంది. ఎరువుల కొనుగోలు ప్రక్రియను సులభతరం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం నూతన డిజిటల్ విధానాన్ని అందుబాటులోకి తీసుకువస్తోంది. ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫర్టిలైజర్ సేల్ (FFS) యాప్ ద్వారా రైతులు ముందుగానే ఎరువులను బుక్ చేసుకునే అవకాశం కల్పిస్తోంది. ఈ నెల 16వ తేదీ నుంచి ఈ విధానం అమల్లోకి రానుందని పార్వతీపురం మన్యం జిల్లా వ్యవసాయాధికారి భవానీ శంకర్ తెలిపారు. రైతులు గూగుల్ ప్లే స్టోర్ నుంచి FFS యాప్ ను డౌన్ లోడ్ చేసుకొని ఆధార్ లేదా ఏపీ.ఎఫ్.ఆర్ ఫార్మర్ ఐడీ ద్వారా ఓటీపీతో లాగిన్ కావాలన్నారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు, ధాన్యం

కొనుగోలు, ఎరువుల పంపిణీ, పంటల బీమా, పంట నష్టపరిహారం పొందేందుకు ఏపీ.ఎఫ్.ఆర్ ఫార్మర్ ఐడీ తప్పనిసరి కానుందని పేర్కొన్నారు.

==========

ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం కొనసాగుతోందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. ఇది వాయవ్య దిశగా పయనిస్తూ రేపు అదే ప్రాంతంలో వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఉత్తర-వాయువ్య దిశగా కదులుతూ సోమవారం ఉదయానికి తీవ్రవాయుగుండంగాను, అలాగే సాయంత్రానికి దక్షిణ మధ్య, దానికి ఆనుకుని ఉన్న పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తుపానుగా బలపడే అవకాశం ఉందని వెల్లడించారు. బుధవారానికి తీవ్రతుపాన్ గా మారే అవకాశం ఉందన్నారు. ఆ తరువాత ఉత్తర కోస్తాంధ్ర ప్రాంతాల్లో తీరం దాటే అవకాశం ఉందని తెలిపారు. దీని ప్రభావంతో గురు, శుక్రవారాల్లో ఉత్తరాంధ్ర ప్రాంతాల్లో భారీ వర్షాలు, బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని తెలిపారు. మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్ళరాదని హెచ్చరించారు.

==========

బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని కృష్ణాజిల్లా న్యాయ సేవాధికార సంస్థ.. మచిలీపట్నంలో ఈరోజు నగరపాలక సంస్థ బాలికల ఉన్నత పాఠశాలలో బాలికలకు న్యాయ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. కార్యక్రమంలో కృష్ణాజిల్లా ప్రధాన న్యాయమూర్తి సి. యామిని మాట్లాడుతూ.. పేద, బలహీన వర్గాల ప్రజలకు న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచితంగా న్యాయ సహాయం అందిస్తామని తెలిపారు. న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించి ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని వివరించారు. ప్రతి ఒక్కరికీ న్యాయం పొందే హక్కు ఉందని, ఆర్థిక పరిస్థితులు న్యాయానికి అడ్డంకి కాకూడదని పేర్కొన్నారు. బాలికలపై లైంగిక వేధింపులు, దాడుల నుంచి రక్షణ కల్పించేందుకు పోక్సో చట్టం అమలులో ఉందని, ఇటువంటి ఘటనలు ఎదురైనప్పుడు భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు.

==========

తెలుగు సినీ నటుడు గిరిబాబు (80) కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఈరోజు హైదరాబాద్ లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. 1946 జూన్ 8న ప్రకాశం జిల్లా కొరిశపాడు రావినూతల గ్రామంలో జన్మించిన గిరిబాబు ‘జగమే మాయ’ చిత్రంతో సినీ పరిశ్రమకు పరిచయమయ్యారు. కథానాయకుడిగా, ప్రతినాయకుడిగా, సహాయ నటుడిగా రాణించారు. నటుడు గిరిబాబు మృతిపట్ల సినీ, రాజకీయ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

==========
==========